సాక్షి నిర్మల్

శనివారం, 30, మార్చి, 2024



టీచర్లకు 'టెట్' ట్విస్ట్!

డీఎడ్, బీఎడ్ అభ్యర్థులతోపాటు ఇన్‌సర్వీస్ టీచర్లు టెట్ రాసేందుకు సంసిద్ధులవుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:31	ఆది : 4:49

గరిష్ఠం/కనిష్ఠం
38.4 /28.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం తర్వాత వేడి పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆత్మరక్షణకు కరాటే

• డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: మహిళలు, చిన్నారుల ఆత్మరక్షణకు కరాటే దోహదం చేస్తుందని డీసీసీ అధ్యక్షుడ శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే ఎంపిక పోటీలను శుక్రవారం ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. అనంతరం కరాటేలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జపాన్ కరాటే అసోసియేషన్ నాయకులు తేజేంద్ర సింగ్ భాటియా, భూషణ్, కాంగ్రెస్ నాయకులు నరేశ్, నందేడపు చిన్ను, గాజుల రవికుమార్, కొంతం గణేశ్, గడ్డింటి ప్రశాంత్ ఉన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: అబ్ కీ బార్.. చార్ సౌ పార్.. అంటూ బీజేపీ నాయకులు వారికి తోచినంతగా పార్టీకి డొనేషన్ చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ మైక్రో డొనేషన్ కార్యక్రమాన్ని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ ట్రిపుల్ డిజిట్ టార్గెట్‌తో లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమైందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ భారీ మెజార్టీతో కైవసం చేసుకునే లక్ష్యంతో నేతల మధ్య సమన్వయం పెంపొందించడంపై ఫోకస్ చేయాలన్నారు. ప్రస్తుత పరిణామాలను అనుకూలంగా మలుచుకోవడంతోపాటు గెలుపు కోసం కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్లాలన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామన్న భావన ప్రజల్లో ఉందని, కాంగ్రెస్ వైఫల్యాలే ప్రచార అస్త్రాలు అవుతున్నాయన్నారు. సభలు, సమావేశాల కన్నా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రధాని మోదీ పథకాలతో పొందుతున్న ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. ప్రతీ ఓటర్‌ను బీజేపీ కార్యకర్తలు కలవాలన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపెల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రామనాథ్, మైక్రో డొనేషన్స్ ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమే రాజు, మైక్రో డొనేషన్స్ నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ కోరిపల్లి శ్రావణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కమల్ నయన్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు రాచకొండ సాగర్, అసెంబ్లీ కన్వీనర్ గాదె విలాస్, బీజేపీ సీనియర్ నాయకులు కొమ్ముల వినాయకరెడ్డి, భూపతిరెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం స్వాధీనం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖిల్లాగుట్ట ఆవరణంలోని వివాదాస్పద ఖాళీ స్థలాన్ని మున్సిపల్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థలం సమీపంలో పలు ఆలయాలున్నాయి. అక్కడ ఏటా అన్నదానం నిర్వహిస్తున్నారు. అయితే ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అక్కడున్న జెండాలను ఓ వర్గానికి చెందినవారు తొలగించే ప్రయత్నం చేశారు. అడ్డుకునే క్రమంలో ఇరువర్గాల మధ్య ఆందోళన చోటుచేసుకుంది. దీంతో పలువురు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకు ఇరు వర్గాలను చెదరగొట్టారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ముధోల్‌కు సమన్వయ కమిటీ: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఈ కమిటీలో రమాదేవి, లోలమ్ శ్యాంసుందర్, విలాశ్ గాదేవర్, డా.కిరణ్ కమ్మెవర్ సభ్యులుగా ఉంటారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

'ఉపాధి' @ 70%



కప్పన్‌పల్లిలో ఫిష్‌పాండ్ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

• కార్డులు ఎక్కువ.. హాజరు తక్కువ
• వందరోజులు పూర్తి చేసుకున్నవి 6,026 కుటుంబాలే

భైంసాటౌన్/మామడ: గ్రామీణ పేదలకు ఏడాదికి వంద రోజులు పని కల్పించాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో సగటున 70 శాతమే కూలీలు వినియోగించుకుంటున్నారు. పేరుకు జాబ్‌కార్డులు ఎక్కువగా ఉన్నా వాటిలో క్రియాశీలకంగా ఉన్నవి 70 శాతం మాత్రమే. అంటే సగటున వందకు 70 మంది మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నారు. మిగిలిన వారు జాబ్‌కార్డు ఉన్నా వినియోగించుకోవడం లేదు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య పెరుగుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వందరోజులు పూర్తి...

జిల్లాలో ఈ ఏడాది 6,026 కుటుంబాలు మాత్రమే వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. మండలాలవారీగా పరిశీలిస్తే బాసరలో 78 కుటుంబాలు, భైంసాలో 160, దస్తురాబాద్‌లో 23, దిలావర్‌పూర్‌లో 332, కడెంలో 884, ఖానాపూర్‌లో 463, కుభీర్‌లో 150, కుంటాలలో 176, లక్ష్మణచాందలో 265, లోకేశ్వరంలో 170, మామడలో 588, ముధోల్‌లో 173, నర్సాపూర్‌లో 494, నిర్మల్‌లో 1,056, పెంబిలో 455, సారంగపూర్‌లో 141, సోన్‌లో 178, తానూర్‌లో 240 కుటుంబాలు వందరోజులు పని పూర్తి చేసుకున్నాయి.



న్యూసాంగ్వీలో పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో

రూ.184 కోట్ల పనులు..

జిల్లాలోని 396 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇప్పటి వరకు రూ.184 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. జిల్లాలో సగటున ఒక్కొక్కరు 50 పనిరోజుల పనిదినాలు పూర్తి చేశారు. ఉపాధిహామీ కూలి సగటున రూ.185 చెల్లించారు. వందరోజుల పనిరోజులు పూర్తి చేసుకున్న కూలీలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉపాధిహామీ పనులలో వందరోజులు పూర్తి చేసుకున్న 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి లైఫ్‌ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధికోసం శిక్షణ అందిస్తారు. కుట్టుమిషన్, మొబైల్ ఫోన్ రిపేరింగ్ వంటివి నేర్పిస్తారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.200 స్టైఫండ్ ఇస్తారు. శిక్షణ అనంతరం డీఆర్‌డీవో ఆధ్వర్యంలో సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు రుణం అందిస్తారు.

జిల్లాలో ఇలా...	
మొత్తం జాబ్‌కార్డులు	1,74,035
ఉపాధి కూలీలు	3,34,044
మహిళా కూలీలు	1,71,594
క్రియాశీల కార్డులు	1,30,659
క్రియాశీల కూలీలు	2,32,767
మహిళా కూలీలు	1,25,114
సగటున ఉపాధి పొందుతున్నవారు	69.68 శాతం

దినసరి వేతనం పెంపు..

ఉపాధి హామీ కూలీలకు అందిస్తున్న వేతనాన్ని రూ.300లకు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఏప్రిల్ నుంచి పెంచిన వేతనం అమలు కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపాధి అందించాలన్న ఉద్దేశంతో 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుంది. మొదట్లో రూ.87.50 మాత్రమే చెల్లించేవారు. ప్రస్తుతం రూ.272 అందిస్తుండగా, ఏప్రిల్ నుంచి రూ.28 పెంచి ఇవ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే ఉపాధిహామీ కూలీల వివరాలను, ఆధార్ వివరాలను ఆన్‌లైన్ చేశారు. దీంతో పెరిగిన వేతనాలు నేరుగా కూలీల ఖాతాల్లో జమ కానున్నాయి.

నడ్డాను కలిసిన 'సోయం'



బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో ఎంపీ సోయం బాపూరావు, పక్కన కిన్వట్ ఎమ్మెల్యే భీంరావు

• కేంద్ర స్థాయిలో నామినేటెడ్ పదవి హామీ ఇచ్చినట్లు వెల్లడి
• బంధువు మహారాష్ట్రలోని కిన్వట్ ఎమ్మెల్యే ద్వారా రాయబారం

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు శుక్రవారం ఢిల్లీలో కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దేశంలో మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర స్థాయిలో నామినేటెడ్ పదవి ఇస్తామని నడ్డా హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. స్వతంత్ర అభ్యర్థిగా తాను పోటీ చేస్తానని సోయం ప్రకటించిన నేపథ్యంలో అధిష్టానం ఆయనను బుజ్జగించే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే జాతీయ అధ్యక్షుడు నడ్డా ఈ హామీ ఇచ్చినట్లు చెప్పుకుంటున్నారు.

రాజీకి రాష్ట్ర నేతల యత్నం..

బీజేపీ ఆదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా గొడం నగేశ్‌ను ప్రకటించిన తర్వాత సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. అంతే కాకుండా ఎన్నికల్లో తాను పోటీ చేయడం ఖాయమని చెప్పారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోయంను బుజ్జగించే యత్నం చేశారు. కేంద్ర స్థాయిలో నామినేటెడ్ పదవి హామీ ఇచ్చారు. అప్పుడే సోయం తనకు నడ్డా లేనిపక్షంలో బీఎల్ సంతోష్ ద్వారా హామీ ఇచ్చినట్లయితే పరిశీలన చేస్తానన్నారు. విషయాన్ని కొద్ది రోజులు నాన్చడంతో ఈ హామీ లభించకపోవచ్చనే ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా ఇటీవల హైదరాబాద్‌లో అన్ని పార్లమెంట్ సెగ్మెంట్లకు సంబంధించి అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, పార్లమెంట్ బాధ్యులతో కిషన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఆ రోజు తెలంగాణ ఇన్‌చార్జి సునిల్ బన్సల్ కూడా అందులో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సోయంను పార్టీ ఆఫీస్‌లో చర్చలకు పిలిచినా ఆయన హాజరుకాలేదు.

మహారాష్ట్ర ఎమ్మెల్యే ద్వారా రాయబారం..

ఎంపీ సోయంతో రాష్ట్ర నేతల రాజీ యత్నాలు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో కిషన్‌రెడ్డి.. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేందర్ ఫడ్నవిస్ ద్వారా ఎంపీ సోయం బంధువు అయిన కిన్వట్ ఎమ్మెల్యే, గిరిజన నేత కేరం భీంరావుతో చర్చలు జరిపినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఆయన రంగంలోకి దిగి సోయంను చర్చల కోసం శుక్రవారం ఢిల్లీకి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే నడ్డాను ఈ నేతలు కలిశారు. ఈ విషయంపై సోయం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాను ఢిల్లీ వచ్చినట్లు పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షుడు నడ్డా నామినేటెడ్ పదవి విషయంలో హామీ ఇచ్చారని వివరించారు.

మత్తు.. యువత చిత్తు



ఫిబ్రవరి 9న పట్టుకున్న అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను చూపుతున్న పోలీసు అధికారులు

• జిల్లాలో గుప్పుమంటున్న గంజాయి
• పెరుగుతున్న అమ్మకాలు
• విక్రయదారులుగానూ జిల్లావాసులు
• కట్టడికి స్పెషల్ టీమ్‌లు : ఎస్పీ

నిర్మల్: మత్తుపదార్థాలకు బానిసైన యువత సిగరెట్లు, మద్యం దాటి.. గంజాయి దాకా వెళ్తోంది. కొత్తగా ఉంటుందంటూ ఈ మత్తును ఎక్కించే ముఠాలూ పెరుగుతున్నాయి. చాటుమాటుగా అమ్మేస్థాయి నుంచి నేరుగా జిల్లాకేంద్రానికి తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నాయి. పోలీసులు చేస్తున్న తనిఖీల్లో గంజాయి సేవించడమే కాదు, విక్రయదారులుగానూ యువత బయట పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే 30–40 శాతం సిగరెట్లు, మద్యాన్ని దాటి గంజాయికి బానిసలుగా మారినట్లు స్పష్టమవుతోంది. మరోవైపు ఈ మత్తును అరికట్టేందుకు కొత్తగా స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

గుప్పు.. గుప్పు..

సరదాగా సిగరెట్‌ను 'గుప్పు...గుప్పు..'మంటూ పీలుస్తూ మత్తు పదార్థాలకు అలవాటవుతున్న యువత క్రమంగా గంజాయి గుంజేదాకా వస్తున్నారు. 'ఒక్కసారి పీలిస్తే.. ఏం కాదులే..' అని, 'గంజాయి టేస్ట్ కూడా చూద్దాం..' అంటూ మెల్లగా బానిసవుతున్నారు. సరదాకు మొదలు పెట్టిన చాలా మంది ఇప్పుడు రోజుకు ఒక్కసారైనా గంజాయి పీల్చకపోతే పరేషానవుతున్నారు. చాలామంది పొద్దున్నే అడ్డాల వద్దకు వెళ్లిపోతున్నారు. అమ్మేచోటు నుంచి ఒకరిద్దరు వెళ్లి తీసుకువస్తే అందరూ షేర్ చేసుకుంటున్నారు.

అడ్డాలు పెట్టుకుని..

సిగరెట్ ఎప్పుడంటే అప్పుడు తాగొచ్చు. కానీ దాంతో మత్తు రాదు. మద్యం ఎప్పుడు పడితే అప్పుడు తాగడానికి వీలుకాదు. దానికి డబ్బులు కూడా ఎక్కువే కావాలి. ఈ క్రమంలో యువత సులువుగా సిగరెట్ మాదిరి తాగితే, తక్కువ ఖర్చులో ఎక్కువ మత్తు ఇచ్చే గంజాయికి ఆకర్షితులవుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో గంజాయి తాగేందుకు ప్రత్యేకంగా అడ్డాలు పెట్టుకున్నారు. జిల్లాకేంద్రంలో చుట్టూ చెరువులు, గుట్టలు, అటవీప్రాంతాలే అడ్డాలుగా మారాయి. కొంతకాలంగా శివారు కాలనీల్లోనే గంజాయి విక్రయాలు చేస్తున్నారు. పోలీసుల తనిఖీల్లోనూ చాలాసార్లు ఇవే అడ్డాలు, కాలనీల్లో భారీగా గంజాయి పట్టుబడింది.

మత్తులో ఏం చేస్తున్నారో..

గంజాయి మత్తులో తామేం చేస్తున్నారో.. కూడా తెలియదు. రెండేళ్ల క్రితం19 ఏళ్ల యువకుడు గంజాయి మత్తులో స్పీడ్‌గా బైక్ డ్రైవింగ్ చేస్తూ జిల్లా కేంద్రంలోనే రోడ్డుప్రమాదానికి గురయ్యాడు. తనతోపాటు వెంట ఉన్న మిత్రుడూ చనిపోయాడు. గతంలో మరో యువకుడూ ఇలాగే ప్రాణాలు కోల్పోయాడు. తాను బైక్‌తో ఢీకొట్టడంతో దంపతులకూ తీవ్రగాయాలయ్యాయి. గంజాయి మత్తులో తామేం చేస్తున్నామో తెలియకపోవడంతో యువత దారితప్పుతున్నారు. బైక్, గొలుసు దొంగతనాలు, ఇతరత్రా కేసుల్లో పట్టుబడుతున్న యువతలో చాలామంది గంజాయి వ్యసనం ఉన్నవాళ్లే ఉండటం గమనార్హం.




గతంలో పోలీసులు పట్టుకున్న గంజాయి

స్పెషల్ టీమ్‌ల ఏర్పాటు..

జిల్లాలో గంజాయి అమ్మకాలతోపాటు ఇక్కడి నుంచి విక్రయించే వారి సంఖ్య పెరుగుతుండటంతో పోలీసులూ సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఎస్పీ జానకీషర్మిల సైతం గంజాయి సాగు, విక్రయం, యువతపై దాని ప్రభావంపై పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈమేరకు గంజాయి అరికట్టేందుకు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఫిబ్రవరి 9న నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ వద్ద అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి దాదాపు 50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికీ ప్రత్యేక బృందాలు గంజాయి అమ్మకాలపై దృష్టిపెట్టాయని ఎస్పీ పేర్కొన్నారు.

పకడ్బందీగా చర్యలు..



ప్రధానంగా యువతను మత్తుపదార్థాలకు బానిసలుగా చేస్తున్న గంజాయిని అరికట్టేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరికి సమాచారం ఉన్నా.. పోలీసులకు చేరవేయాలని సూచిస్తున్నాం. యువత మత్తుపదార్థాల బారిన పడకుండా వివిధ కార్యక్రమాలను త్వరలోనే చేపడతాం. జిల్లాలో డీఅడిక్షన్ కేంద్రం ఏర్పాటు చేయిస్తాం.

–జానకీషర్మిల, ఎస్పీ

ప్రభుత్వ ఆస్పత్రిలో మోకీలు ఆపరేషన్

నర్సాపూర్ మండలం రాంపూర్‌కు చెందిన సట్ల పద్మ ఆరేళ్లుగా తుంటి ఎముక నొప్పితో బాధపడుతోంది. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి, ఆపరేషన్ చేయించుకోలేని పరిస్థితిలో ప్రభుత్వ వైద్యులు అండగా నిలిచారు. ఈ నెల 6న తుంటి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు.

ఖానాపూర్‌కు చెందిన కుంచపు మల్లమ్మ నాలుగేళ్లుగా మోకాళ్ల నొప్పితో బాధపడుతోంది. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే ఆపరేషన్ కు రూ.3 లక్షలు అవుతుందని తెలిపారు. దీంతో ఆమె ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. డాక్టర్లు మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేశారు.

సోన్ మండలం మాదాపూర్‌కు చెందిన నర్సారెడ్డి (50) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఇతని ఆర్థిక పరిస్థితుల కారణంగా జిల్లా జనరల్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు తుంటి మార్పిడి ఆపరేషన్ ఉచితంగా విజయవంతంగా చేశారు.

• విజయవంతంగా నిర్వహిస్తున్న వైద్యులు
• అన్నిరకాల ఆపరేషన్లపై వైద్యుల దృష్టి
• రూపాయి ఖర్చు లేకుండా చికిత్స
• మెడికల్ కళాశాల రావడంతో పెరిగిన సౌకర్యాలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సకు కేరాఫ్‌గా మారింది. సుమారు రూ.2 లక్షల ఖరీదైన ఈ ఆపరేషన్‌ను ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా చేస్తున్నారు. ఇవే కాకుండా.. అత్యంత ఖరీదైన అన్ని విభాగాల శస్త్రచికిత్సలపై వైద్యులు దృష్టిసారించారు. జిల్లా ఆస్పత్రి మెడికల్ కళాశాలగా మారడంతో డాక్టర్లు, ప్రొఫెసర్ల సంఖ్య పెరిగింది. అన్ని విభాగాలకు సరిపడా వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రతీరోజు మోకీలు, తుంటి మార్పిడి, ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తూ నిరుపేదలకు ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారు.

అన్నిరకాల శస్త్రచికిత్సలు..

దశలవారీగా రోగులకు అన్నిరకాల ఆపరేషన్లు చేసేలా కార్యాచరణ రూపొందించారు. రెండేళ్ల క్రితం వరకు కోవిడ్–19 పలు శస్త్రచికిత్సలపై తీవ్ర ప్రభావం చూపింది. అంతేకాకుండా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కోవిడ్ ఆస్పత్రిగా మారడంతో పేషెంట్లు రావడానికి విముఖత చూపారు. ప్రస్తుతం వైద్యులు సాధారణ శస్త్రచికిత్సలతోపాటు అన్ని రకాల ఖరీదైన ఆపరేషన్లు చేస్తూ పేద రోగులకు అండగా నిలుస్తున్నారు.

అత్యాధునిక ఆపరేషన్ థియేటర్..

ఇటీవల ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించడం, వైద్య కళాశాల ఏర్పాటు, సరిపడా వైద్యులను నియమించింది. ఫలితంగా నిరంతరం ఆపరేషన్లు జరుగుతున్నాయి. వీటికోసం అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉంది. ఇటీవలి కాలంలో తుంటి ఎముకలు విరిగిన వారికి సైతం తుంటి ఎముక మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారు. మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలతోపాటు తీవ్రంగా గాయపడి పేగులు బయటకు వచ్చిన వారిని కూడా సర్జరీ చేసి పునర్జన్మనిస్తున్నారు. ఇవన్నీ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగానే చేస్తున్నారు.



తుంటి ఎముక మార్పిడి అనంతరం డిశ్చార్జి అయి వెళ్తున్న మల్లమ్మ

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న మిషనరీతో అన్నిరకాల శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో చేసే ఖరీదైన ఆపరేషన్లు ఇక్కడ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. పేదలు ప్రైవేటు దవాఖానాకు వెళ్లి, ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అరుణ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జిల్లా జనరల్ ఆసుపత్రి

మెరుగైన సేవలు..



జిల్లా ఆసుపత్రిలో మెడికల్ కళాశాల ఏర్పాటు అయిన తర్వాత పేదలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. కార్పొరేట్ స్థాయి వైద్యం ఇక్కడ ఉచితంగా లభిస్తుంది. సేవరు చాలా వరకు మెరుగవ్వాయి. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ సునీల్‌కుమార్, జిల్లా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే





జిల్లాలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు శిలువపై పలికిన మాటలను తెలిపి అందులోని సత్యాన్ని వివరించారు. నిర్మల్ గాజులపేటలోని చర్చిలో పాస్టర్ సునీల్‌కుమార్ దైవ సందేశం అందించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

క్లుప్తంగా

సుగుణ అభ్యర్థిత్వంపై హర్షం

నార్నూర్: కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణను ప్రకటించడంపై ఆదివాసీ సమాజం హర్షం వ్యక్తంజేస్తోందని పార్టీ పార్లమెంటరీ కోఆర్డినేటర్ సెడ్మాకి ఆనందరావు పేర్కొన్నారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులకు ఎంతో ఆసరాగా ఉన్న జీవో 3ను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొలగించి ఆదివాసీ గిరిజనులకు ఎంతో అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోనే ఆదివాసీలకు ట్రైబల్ బెటాలియన్, ఏజెన్సీ డీఎస్సీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి పాటుపడుతోందని పేర్కొన్నారు. నాయకులు అరక శేషరావు, ఆదివాసీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్‌రావు, మాజీ సర్పంచ్, గాదిగూడ మండలాధ్యక్షుడు గెడం పరశురాం, నాయకుడు లింబరావు తదితరులున్నారు.

చెట్టు పైనుంచి పడి మహిళకు గాయాలు



బాధితురాలిని పరామర్శిస్తున్న జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: మత్తడిగూడ పంచాయతీ పరిధి పెద్దసుద్ద గూడ గ్రామానికి చెందిన వెడ్మ గిరిజాబాయి శుక్రవారం సమీప అటవీ ప్రాంతానికి మొర్రి పండ్ల సేకరణకు వెళ్లి చెట్టు పైనుంచి కాలు జారి కింద పడగా కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆమెను ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ జైవంత్‌రావు మహిళను ఆస్పత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సిబ్బందికి సూచించారు.


ఆస్తి తగాదాలతో ఒకరి ఆత్మహత్య



మాలి నూర్‌సింగ్ మృతదేహం

నేరడిగొండ: ఆస్తి తగాదాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. మండలంలోని రాజులతండాకు చెందిన మాలి నూర్‌సింగ్ (49)కు కొడుకు అంకుష్‌తో ఆస్తి తగాదాలున్నాయి. ఈక్రమంలో శుక్రవారం అంకుష్ తండ్రితో ఆస్తి పంపకం చేయాలని గొడవకు దిగాడు. ఇది నచ్చని నూర్‌సింగ్ పంటచేనులో పురుగుల మందు తాగాడు. అతడి భార్య సూరజాబాయి గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి ఆటోలో అతడిని చికిత్స కోసం బోథ్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కొద్దిరోజులుగా తండ్రీకొడుకుల మధ్య ఆస్తి తగాదాల విషయమై వారి కుల పెద్దల వద్ద పంచాయితీలు జరిగినట్లు సమాచారం. మృతుడి భార్య సూరజాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

టీచర్లకు ‘టెట్’ ట్విస్ట్!



నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రవ్యాప్తంగా టెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నెల 27వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. నిర్మల్ జిల్లాలోని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులతోపాటు ఇన్‌సర్వీస్ టీచర్లు కూడా పరీక్ష రాసేందుకు సంసిద్ధులవుతున్నారు. ఈ అంశంపై జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం పొందేందుకు టెట్ తప్పనిసరి చేస్తూ 2012లో ఎన్సీటీఈ మార్గదర్శకాలు విడుదల చేసింది. అప్పటినుంచి ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో టెట్ అర్హత సాధించినవారికే డీఎస్సీ రాయడానికి అవకాశం కల్పించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రమోషన్లలోనూ టెట్ అర్హత తప్పనిసరి చేస్తూ ఎన్సీటీఈ ఇటీవల స్పష్టం చేయడంతో సీనియర్ ఉపాధ్యాయులు మల్లగుల్లాలు పడుతున్నారు. మరోవైపు టెట్ అర్హత తప్పనిసరి చేయడంపై సీనియర్ ఉపాధ్యాయుల్లో అసంతృప్తి కనిపిస్తోంది.

టీచర్లలో సిలబస్ ఆందోళన

ఇప్పుడున్న సిలబస్ ప్రకారం అన్ని సబ్జెక్టులపై పట్టు ఉంటేనే గాని టెట్ అర్హత పొందడం కష్టమని సీనియర్ టీచర్లు భావిస్తున్నారు. టెట్ అనివార్యమైతే సులభంగా ఉండే డిపార్ట్‌మెంటల్ పరీక్ష మాదిరి ప్రత్యేకంగా నిర్వహించాలని కోరుతున్నారు. జనరల్ అభ్యర్థులకు 150 మార్కులకు 90 మార్కులు వస్తేనే అర్హత లభిస్తుంది. బీసీ అభ్యర్థులకు 75, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 60 మార్కులు పొందాల్సి ఉంటుంది. కాగా, కోచింగ్ తీసుకున్న నిరుద్యోగ అభ్యర్థుల్లో కూడా జిల్లాలో 20నుంచి 25శాతం మాత్రమే అర్హత సాధిస్తుండటం గమనార్హం.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలా నిర్వహించాలని..

దీర్ఘకాలంగా పనిచేస్తున్న టీచర్లకు టెట్ పరీక్ష అంతర్గతంగా నిర్వహించాలని సంబంధిత ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు. ఇతర అభ్యర్థులతో కాకుండా వేరుగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీన్ని డిపార్ట్‌మెంటల్ టెస్ట్‌లా నిర్వహిస్తే మేలని వారు భావిస్తున్నారు. ఎప్పుడో బీఈడీ, టీటీసీ పూర్తి చేసిన టీచర్లు ఇప్పుడు టెట్ రాస్తే పాసయ్యే అవకాశం తక్కువ అని వాపోతున్నారు. అందుకే ప్రత్యేక సిలబస్‌తో టీచర్లకు టెట్ నిర్వహించాలని కోరుతున్నారు.

సీనియర్ల అభ్యంతరాలు

తాజా మార్గదర్శకాల ప్రకారం ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు పొందేందుకు కచ్చితంగా టెట్ అర్హత సాధించి తీరాల్సిందే. దీంతో సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. టెట్ రాయాలన్న నిబంధనను టీచర్లు వ్యతిరేకిస్తున్నారు. సిలబస్ విడుదలైన వెంటనే అధికారులను ఉపాధ్యాయ సంఘాలు కలిసి అభ్యంతరాలు తెలియజేశాయి. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఏదో ఒక సబ్జెక్టులో మాత్రమే నిష్ణాతుడై ఉంటారని తెలిపారు. అన్ని సబ్జెక్టులతో కూడిన టెట్ రాయడం అసాధ్యమని చెబుతున్నారు. ఇటీవలి కాలంలో బీఎడ్, డీఎడ్ చేసిన అభ్యర్థులు తేలికగా టెట్ రాసే వీలుందని, కొన్నేళ్ల క్రితం ఈ కోర్సులు చేసిన టీచర్లు ఎలా రాస్తారనే వాదన లేవనెత్తుతున్నారు.

ప్రమోషన్లకూ టెట్ అవసరమే...



ఎన్సీటీఈ మార్గదర్శకాలు, కోర్టు తీర్పుల ప్రకారం ప్రమోషన్లు పొందేందుకు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులకూ టెట్ అవసరమని స్పష్టమైంది. టెట్ అర్హతతోనే ఉపాధ్యాయులకు ప్రమోషన్లివ్వాలి. ఇదే అంశంపై ఇటీవల కూడా జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. వీటిని అమలు పర్చుతూ ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలి.

– పోశెట్టి, ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

వెసులుబాటు కల్పించాలి



టెట్ అనేది అర్హత పరీక్ష మాత్రమే. దీన్ని శాఖాపరమైన పరీక్షలాగా భావించాలి. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు కొన్నేళ్లపాటు వెసులుబాటు కల్పిస్తూ ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలి. ప్రస్తుతం టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. మూడు దశాబ్దాలక్రితం వృత్తిలోకి ప్రవేశించిన ఉపాధ్యాయులకు టెట్ అర్హత సాధించడం కష్టమవుతుంది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

– విజయ్‌కుమార్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉత్తీర్ణతకు సమయమివ్వాలి



ఎన్సీటీఈ మార్గదర్శకాల ప్రకారం 2010 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ అర్హత అవసరం లేదు. ప్రభుత్వం ఆలోచించి సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి. లేదా డిపార్ట్‌మెంటల్ పరీక్షల మాదిరి ప్రత్యేక టెట్ నిర్వహించాలి. టెట్ అర్హత సాధించడానికి ఐదేళ్ల నుంచి పదేళ్లదాకా సమయమిస్తూ ప్రమోషన్ల ప్రక్రియ పూర్తిచేయాలి.

– నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

విద్యుదాఘాతంతో ‘ఆశ్రమ’ విద్యార్థికి గాయాలు



రిమ్స్‌లో విద్యార్థిని పరామర్శిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఉట్నూర్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ఉట్నూర్ మండలం ఘన్పూర్ గ్రామానికి చెందిన టేకం దేవ్‌రావుకు విద్యుత్ షాక్ తగలగా గాయపడ్డాడు. విషయం బయటకు పొక్కనీయకుండా వసతిగృహ నిర్వాహకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మూడురోజుల తర్వాత ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న కుమ్రం సూరు యువ సేన జిల్లా అధ్యక్షుడు కుమ్రం రాజు, ఉపాధ్యక్షుడు టేకం భీంరావు శుక్రవారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు ‘సాక్షి’తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ నెల 27న ఉదయం వసతిగృహ నిర్వాహకుల సూచన మేరకు దేవరావు స్లాబ్‌పై ఉన్న నీటి పైపు సరిచేస్తుండగా విద్యుత్‌షాక్ గురై భవనం పైనుంచి కింద పడ్డాడని తెలిపారు. చేయి, కాళ్లు, మెడ భాగంలో తీవ్ర గాయాలు కాగా వసతి గృహ నిర్వాహకులు విషయం అతడి తల్లికి తెలిపి రిమ్స్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దీనిపై వసతిగృహ నిర్వాహకులను తాము ఫోన్‌లో ప్రశ్నించగా క్రికెట్ బాల్ కోసమే భవనం పైకి ఎక్కగా ఘటన జరిగినట్లు అబద్ధమాడారని ఆరోపించారు. ఘటనపై కలెక్టర్, ఐటీడీఏ పీవో విచారణ చేపట్టి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంతో పాటు న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో శుక్రవారం అక్రమంగా నిల్వ చేసిన మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మావల గ్రామానికి చెందిన శ్రీనివాస్ శుక్రవారం మద్యం విక్రయిస్తుండగా అతడి నుంచి ఐదు క్వార్టర్ బాటిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మీవాడకు చెందిన చింతవార్ కృష్ణ న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో మద్యం విక్రయిస్తుండగా అతడి నుంచి ఆరు క్వార్టర్ బాటిళ్లు పట్టుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని కొత్తగూడ, రాంపూర్ గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై ఎస్సై ముజాహిద్ శుక్రవారం దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న నరేశ్, జయంత్ నుంచి లిక్కర్ బాటిళ్లు సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోడం నగేశ్

ఇచ్చోడ: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలని బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని అభినందన్ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసిన కాలంలో బోథ్ అసెంబ్లీ, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేశానని చెప్పారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలను అధిష్టానం తప్పకుండా గుర్తించి భవిష్యత్‌లో అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటా వివరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానందం, ఉపాధ్యక్షులు కదం బాబారావు, గుమ్మడి భీంరెడ్డి, మాదవ్ ఆమ్టే, కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, తాంసి జెడ్పీటీసీ సభ్యుడు తాటిపెల్లి రాజు, మండలాధ్యక్షులు కేంద్రే నారాయణ, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పుత్లిబౌలికి చెందిన ఆటో డ్రైవర్ నస్రీమ్‌పై దాడి చేసిన ఆయ్యుబ్‌ఖాన్‌పై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కలెక్టర్‌చౌక్‌లోని ఆటో స్టాండ్‌లో వరుస క్రమంలో ప్యాసింజర్లను తరలిస్తుంటారు. ఈ క్రమంలో నస్రీమ్ వంతు రాగా ఆయ్యుబ్‌ఖాన్ ప్యాసింజర్లను ఆటోలో కూర్చోబెట్టాడు. దీనిపై వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయ్యుబ్‌ఖాన్ బూతులు తిడుతూ దాడికి పాల్పడగా బాధితుడు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విజయమే లక్ష్యంగా కృషి చేయాలి



నగేశ్‌ను సన్మానిస్తున్న రాథోడ్ రమేశ్, నాయకులు

ఉట్నూర్‌రూరల్: బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కోరారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం రాథోడ్ రమేశ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేశ్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరినీ కలుపుకొని పనిచేస్తామని చెప్పారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటే ధ్యేయంగా కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాథోడ్ రమేశ్, సోయం బాపూరావు బలంతో భవిష్యత్‌లో ప్రతీ ఎన్నికలోనూ విజయమే లక్ష్యంగా ముందుకెళ్తామని ఈ సందర్భంగా ఇతర నాయకులు హామీ ఇచ్చారు. నాయకులు రితేశ్ రాథోడ్, శ్రీరాంనాయక్, కొండేరి రమేశ్, రాజేశ్వర్, తన్నీరు సతీశ్, ధన్‌లాల్ తదితరులున్నారు.

సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు కోచ్‌గా అఖిల



అఖిల

నేరడిగొండ: మండలానికి చెందిన వొరగంటి అఖిల ఎన్ఐఎస్ సాఫ్ట్‌బాల్ కోచ్‌గా పంజాబ్‌లోని పట్యాలలో శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించనున్న 36వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాలికల జట్టుకు కోచ్‌గా అఖిలను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నవీన్‌కుమార్, శోభన్‌బాబు తెలిపారు. అఖిల ఎంపికపై జిల్లా అధ్యక్షుడు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరామ్, ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ హర్షం వ్యక్తంజేశారు.

నగదు పట్టివేత



ఉట్నూర్‌రూరల్: పట్టుబడ్డ నగదుతో అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. అమీనొద్దీన్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.99వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ తదితరులున్నారు.

జైనథ్: పిప్పర్‌వాడ చెక్‌పోస్టు వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.5లక్షల నగదును సీజ్ చేసినట్లు సీఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం తెలిపారు. శుక్రవారం సాయంత్రం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నిజామాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న అసీఫ్ రౌఫ్ ఖురేషీ వద్ద ఈ డబ్బులు లభించినట్లు పేర్కొన్నారు. నగదును సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గొలుసుదొంగ పట్టివేత

నిర్మల్‌టౌన్: సారంగాపూర్ మండలానికి చెందిన వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం నిర్మల్ బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తోంది. ఓ వ్యక్తి అదను చూసి ఆమె మెడలోని బంగారు ఆభరణం అపహరించాడు. వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. బస్టాండ్ గోడ దూకి తప్పించుకునే యత్నంలో ఉండగా స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నేరడిగొండ: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ తెలిపారు. ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు నేరడిగొండలో జరిగిన సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో కేజీబీవీలో చదువుతున్న శ్రీలేఖ, అర్షిత, రుషి, బాలుర విభాగంలో ఈనెల 23, 24 తేదీల్లో నల్లగొండ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనగా జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వెంకటేశ్, ఇంద్రజిత్ ఈనెల 28నుంచి ఏప్రిల్ 2వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగే సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ 23–24 పోటీల్లో తెలంగాణ జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉపాధ్యక్షుడు గోడం జ్యోతిరామ్, అసోసియేషన్ సభ్యులు తిరుమలేశ్, నాగరాజు, మెహన్, రాధేశ్యామ్ శుక్రవారం క్రీడాకారులను అభినందించారు.

‘ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి’



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

ఎదులాపురం: కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కురపాటి రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు లాభదాయకంగా కార్మిక చట్టాలను మార్పుచేసి కార్మికులను కట్టుబానిసలను చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. బీజేపీ అదానీ, అంబానీల ఆస్తులు పెంచి, ఆకలి సూచీలో దేశాన్ని 111వ స్థానంలో నిలిపిందని విమర్శించారు. దేశంలో 104 కోట్ల మంది పేదలు దారిద్ర్యంలో ఉన్నారని ఐక్యరాజ్యసమితి పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. మతాల మధ్య చిచ్చు పెట్టి అన్నదమ్ముల్లా కలిసి ఉన్న దేశపౌరులను విడదీస్తూ రాజకీయ పబ్బం గడుపుతోందని ఆరోపించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అల్లర్లు సృష్టిస్తూ కుటిల నీతికి పాల్పడుతోందని మండిపడ్డారు. ఎన్నికల బాండ్ల పేరిట రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడినా బీజేపీపై కనీసం కేసు నమోదు కాలేదని పేర్కొన్నారు. కేంద్రం ప్రతిపక్షాలపై ఈడీని ఉసిగొల్పి అరెస్టులకు పాల్పడుతోందని విమర్శించారు. లిక్కర్ మాఫియా నుంచి రూ.55 కోట్లు బీజేపీకి ముట్టాయని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టి తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు యాటల సోమన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేశ్, గంగన్న, వెంకటమ్మ, లింగాల చిన్నన్న, కార్యదర్శులు సుజాత, అగ్గిమల్ల స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గంగయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తండ్రికి బాలుడిని అప్పగిస్తున్న స్థానికులు

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో తప్పిపోయిన మూడేళ్ల బాలుడిని పలువురు గుర్తించి బాధిత కుటుంబీకులకు అప్పగించారు. నిర్మల్‌రూరల్ మండలం ముజ్గి సమీపంలోని సంగెం గ్రామానికి చెందిన లావణ్య–లక్ష్మణ్ దంపతులు మూడేళ్ల కుమారుడు కార్తీక్‌తో కలిసి శుక్రవారం ఖానాపూర్ పట్టణంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యారు. ఈ క్రమంలో ఆడుతూ బయటకు వెళ్లిన బాలుడు తిరిగిరాలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోని శ్రీరాంనగర్ కాలనీలో తిరుగుతుండగా పట్టణానికి చెందిన గడ్డి రమేశ్, కైలాస్, దాసరి రాజన్న, సబ్బని రాజశేఖర్ గుర్తించి వివరాలు ఆరా తీశారు. క్షేమంగా బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. తప్పిపోయిన కుమారుడిని గుర్తించి అప్పగించిన వారికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కల దాడిలో ఒకరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన ధ్యానవత్ రమేశ్ కుక్కల దాడిలో గాయాలపాలయ్యాడు. వృత్తిరీత్యా ఆర్టిస్ట్ అయిన రమేశ్ రోజులాగే శుక్రవారం పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. మార్గంమధ్యలో కుక్కలు దాడి చేయగా బైక్ పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన కుడి చేయి విరిగింది. ప్రస్తుతం నిర్మల్‌లోని ఓ ఆస్పత్రిలో రమేశ్ చికిత్స పొందుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నిర్మల్‌టౌన్: మామడ మండలం న్యూలింగంపల్లికి చెందిన రాజు (30) జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పశువుల కాపరి అయిన రాజు శుక్రవారం బైక్‌పై నిర్మల్‌కు వచ్చాడు. స్థానిక మారమ్మ ఆలయ సమీపంలో అదుపుతప్పి కింద పడ్డాడు. హెల్మెట్ ఎగిరి కిందపడగా తలకు బలమైన గాయమైంది. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బైక్ టైర్ పగిలి ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

భానుడి సెగ తగలకుండా..

ఆదిలాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరాయి. దీంతో జిల్లా జైలులో పెంచుతున్న నాటుకోళ్లు కూడా ఎండ తీవ్రతకు విలవిల్లాడుతుండగా ఖైదీలు వాటిపై పైపుతో నీళ్లు పడుతూ ఉపశమనం కలిగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్





మట్టి గూళ్లు



కడెం ప్రాజెక్ట్ సమీపంలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద ఇంటెక్‌వెల్ కింది భాగంలో కనిపిస్తున్న ఈ మట్టి గూళ్లు పక్షులు నిర్మించినవే. ఒకే చోట వందల సంఖ్యలో కనిపిస్తున్న ఇవి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్